పిల్లలను బడికి పంపించే బాధ్యత తల్లిదండ్రులదే



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది

మణికొండ: పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని అకాడమీక్ మానిటరింగ్ అధికారి జయచంద్రరెడ్డి అన్నారు. మణికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అకాడమీక్ మానిటరింగ్ అధికారి జయచంద్రరెడ్డి, మండల్ నోడల్ ఆఫీసర్ విజయ్‌కుమార్‌లు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడిఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు బడికి పంపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగనాయక్, మణికొండ మున్సిపాలిటీ ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డు కాకూడదు



25 వేల రూపాయలు అందజేస్తున్న మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి

మణికొండ: విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డు కాకూడదని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలానికి చెందిన గూడూరు గ్రామానికి చెందిన కె.బాబు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కె.బాబు కూతురు కె.వాణి మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొని 10వ తరగతి ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించింది. కాలేజీకి వెళ్లి విద్యార్థిని చదువుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తెలియడంతో వారికి సహాయంగా రూ. 25 వేల రూపాయలను అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. నిరుపేదలను ఆదుకునేందుకు తనవంతు బాధ్యతగా ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో సైతం మరింత మందికి సహాయపడతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు బీరప్ప, నాయకులు ఈ.నర్సింగ్‌రావు, శివరాంరెడ్డి, రంగబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు మొక్కల నివారణపై అవగాహన



శాస్త్రవేత్తలకు జ్ఞాపికను అందిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు

ఏజీవర్సిటీ: మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వివిధ పంటలలో కలుపు యాజమాన్య పద్ధతులలో నూతన పోకడలను అనుసరించాలని ప్రముఖ మొక్కజొన్న శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌కే మాలిక్ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పంటల కలుపు యాజమాన్యం పై మూడు రోజుల అవగాహన సదస్సును నిర్వహించారు. వీరితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు కలుపు మొక్కల నివారణపై పరిశోధలలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి, అఖిలభారత ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్‌పీ దూబే, డాక్టర్ జలాలి, డాక్టర్ పీజీ షా, డాక్టర్ సిమర్జీత్‌కౌర్, వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి

శంషాబాద్: పట్టణంలోని రహమన్‌నగర్‌లో కొన్ని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను కొనసాగిస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రైవేటు పాఠశాల తీరుపై నరేసిద్దులు, బావండ్ల ఆనంద్‌లు విద్య, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ పాఠశాల నడిపిస్తున్న యజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు ప్రతులను రాష్ట్ర విద్యాశాఖతో పాటు జిల్లా కలెక్టర్ శశాంకకు సైతం అందజేసినట్లు వారు తెలిపారు.

బండ్లగూడ డిప్యూటీ ఐవోఎస్-2గా దశరథ్

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ మండల డిప్యూటీ ఐవోస్-2గా దశరథ్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన జైనాబ్ సుల్తానా నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.గిరివర్ధన్, టీఎస్‌టీయూ నగర అధ్యక్షుడు మహ్మద్ అహ్మద్ ఖాన్, ఎంటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ మోయిన్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. విజయ్ భాస్కర్, జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నర్సింహ, నాయకులు మతీన్, అసద్ అలీ, అరుణ, నరేష్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ విజేతగా 'పవర్ హిట్టర్స్'

స్ట్రైయిట్ డ్రైవ్ వేదికగా ముగిసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అత్తాపూర్ స్ట్రైయిట్ డ్రైవ్ వేదికగా నిర్వహించిన బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ (బీసీపీఎల్-2024)లో ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథి డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ ప్రారంభించిన ఈ లీగ్ ఫైనల్ మ్యాచ్‌లో పవర్ హిట్టర్స్, పూర్ బాయ్స్ తలపడ్డారు. తొలుత బ్యాటింగ్ చేసిన పూర్ బాయ్స్ జట్టు 7 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 40 పరుగులు చేయగా, అనంతరం పవర్ హిట్టర్స్ జట్టు 6.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన శంకర్ సింగ్ రాజ్‌పుత్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు వైడీఐ ఈవెంట్స్ వ్యవస్థాపకులు క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్రత్ కుమార్ జైన్, అరుణ్ కుమార్ డకోటియా, వేద్ ప్రకాష్ జోషి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

10న వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవం ఈ నెల 10 సోమవారం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఇన్‌చార్జి ఉపకులపతి ఎం. రఘునందన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ చెల్లా శ్రీనివాస్ శెట్టి పాల్గొంటారని అన్నారు. ఇందులో 587 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 165 మంది విద్యార్థులకు పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందజేయనున్నట్లు తెలిపారు. వీరితో పీజీ, పీహెచ్‌డీ, యూజీ విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఏ గాలికి ఎప్పుడు కూలుతాయో..!

శివారుల్లో అడ్డగోలుగా హోర్డింగ్‌లు..!

- ప్రచారాల కోసమే అన్నట్లుగా బస్‌షెల్టర్లు
- వర్షాకాలంలో ప్రమాదాలకు ఆస్కారం
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- గత ప్రభుత్వంలోనూ తొలగించాలని ఆదేశాలు



నార్సింగి ప్రధాన రోడ్డులో ప్రయాణికుల దృష్టిని మరల్చేలా ఉన్న హోర్డింగ్‌లు

మణికొండ: రోడ్లపై ప్రయాణిస్తున్న వారి చూపు తిప్పుకునేలా చేసే హోర్డింగ్‌లు, సైన్ బోర్డులతో వారు ప్రమాదాల వాహనదారులు బారిన పడుతున్నారని వాటిని తొలగించాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆదేశించాయి. దీంతో హైదరాబాద్ నగరంలో ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసిన అనేక హోర్డింగ్‌లను గతంలో తొలగించారు. హైదరాబాద్ నగర శివారులోని మణికొండ, నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీలలోనూ అది అమలు చేయాలని గతంలో నిర్ణయించి పలు మున్సిపాలిటీలు, ఔటర్ రింగ్ రోడ్డు వారీగా వాటిని తొలగించాలని ఆదేశించటంతో అక్కడక్కడ తొలగించారు. ప్రస్తుతం వర్షాకాలం రావటంతో ఈదురు గాలులకు అవి కూలి ప్రజలకు ప్రాణాపాయం కల్పించే పరిస్థితిలో ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. వాటితోపాటు బస్ ప్రయాణికులు కూర్చునేందుకు అక్కడక్కడ బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. కానీ అవి బస్‌లు తిరగతి ప్రాంతాలలో సైతం ఒకటికి బదులుగా నాలుగేసి ఏర్పాటు చేశారని వారు పేర్కొంటున్నారు. వాటిలో కనీసం కూర్చునేందుకు బల్లలు సైతం లేకపోవటం చూస్తుంటే అవి బస్‌షెల్టర్‌లు కావని, ప్రచార వ్యాపార కేంద్రాలని ఇట్టే తెలిసిపోతుందని వారు అంటున్నారు. హైదరాబాద్ నగరంలో హోర్డింగ్‌లు, సైన్ బోర్డులు, ఫ్లెక్సీలు, బస్‌షెల్టర్‌ల లాంటివి ఏర్పాటు చేసేందుకు అనేక ఆంక్షలు ఉన్నాయి. అదే నగర శివారులోని మున్సిపాలిటీలలో అలాంటి ఆంక్షలు అంతగా లేకపోవటంతో వాటి ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు నజరానాలు అందించి ఎక్కడ పడితే అక్కడ, ఎన్ని పడితే అన్ని ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రోడ్ల పక్కన, మధ్యలో ఎలాంటి హోర్డింగ్‌లు ఏర్పాటు చేయవద్దని, వాటిని చూస్తు ప్రయాణికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, వాటిని తొలగించాలని పలుమార్లు కోర్టులు, ప్రభుత్వాలు ఆదేశించాయి. దీంతో అప్పుడప్పుడు కొన్ని తొలగించినట్టు చేయటం, తిరిగి యథావిధిగా ఏర్పాటు చేయటం చేస్తున్నారు. మున్సిపాలిటీలకు వాటి నుంచి ఆదాయం వస్తుందనే సాకుతో అవసరానికి మించి ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లావాదేవీలతో అనుమతులు..

హైదరాబాద్ నగర శివారులో ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లు, బస్‌షెల్టర్లకు పెద్ద డిమాండ్ ఉంది. దీంతో వాటిని ఏర్పాటు చేసే ఏజెన్సీలు మణికొండ, నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీల పరిధిలో ఎక్కడ పడితే అక్కడ వాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో హోర్డింగ్, బస్‌షెల్టర్‌కు ఇంత అని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్‌లు వారి వద్ద నుంచి డబ్బులు దండుకుని అనుమతులు ఇస్తున్నట్లు వారే బాహాటంగా పేర్కొంటున్నారు. ఒక్క హోర్డింగ్‌కు నెలకు రూ. 20వేల నుంచి 50వేల వరకు వారు అద్దెలు వసూలు చేస్తున్నారు. రాబోయే వర్షాకాలంలో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసిన సమయంలో హోర్డింగ్‌లు ప్రజలపై పడే అవకాశం పలు చోట్ల పొంచి ఉంది. వాటిని తొలగించాలని ఆయా మున్సిపాలిటీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కోకాపేటలో ప్రచారాలకే అనే విధంగా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు

ఆదేశాలు రాగానే తొలగిస్తాం



గత ప్రభుత్వంలో రోడ్ల పక్కన ప్రయాణికుల దృష్టిని మరల్చే హోర్డింగ్‌లు, సైన్‌బోర్డులు తొలగించాలని ఆదేశాలు ఉన్నాయి. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో అవసరానికి మించి ఏర్పాటు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వాటికి ఈ సంవత్సరం ఏప్రిల్ మాసం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు వాటిపై స్పష్టత ఇవ్వలేదు, రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే వాటిని తొలగిస్తాం. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం.

–టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

జోరుగా చేపల విక్రయాలు

రాజేంద్రనగర్: మృగశిర కార్తె సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో చేపల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. శనివారం మృగశిర కార్తె కావడంతో చేపలు విక్రయించే వారు తాత్కాలిక గూడారాలను ఏర్పాటు చేసి చేపలను విక్రయించడం ప్రారంభించారు. శుక్రవారం ఉదయం నుంచి అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలల్లో ప్రత్యేక గూడారాలను ఏర్పాటు చేసి విక్రయాలను ప్రారంభించారు. రోజువారి చేపల ధరల కంటే భారీగా ధరలు పెరిగాయని కొనుగోలుదారులు వెల్లడిస్తున్నారు. మృగశిర రోజున చేపలకు గిరాకీ బాగా ఉండటంతో గత సంవత్సరం కంటే ఎక్కువగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం మృగశిర కార్తె రావడంతో శుక్రవారమే పెద్ద ఎత్తున ప్రజలు చేపలను కొనుగోలు చేశారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి



ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సాగర్‌గౌడ్

బండ్లగూడ: విద్యుత్ కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్ అన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఏఈ శ్రీనివాస్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సాగర్‌గౌడ్ మాట్లాడుతూ రోజురోజుకూ విద్యుత్ కోతలు అధికమవుతున్నాయన్నారు. వీటి కారణంగా ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ కట్ చేస్తున్నారన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఏఈని కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

శాశ్వతంగా యూటర్న్ మూసివేత



బాబుల్‌రెడ్డినగర్ రహదారి యూటర్న్ మూసివేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి: ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ ప్రధాన రహదారి మధ్యలో బాబుల్‌రెడ్డినగర్‌కు వెళ్లడానికి వాహనదారులు యూటర్న్ తీసుకునే క్రమంలో ప్రతి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది వాహనదారులకు తీవ్ర గాయాలుతో ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో బాబుల్‌రెడ్డినగర్ నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి విన్నవించగా కొన్ని రోజులు నామమాత్రంగా బారికేడ్లు వేశారు. ప్రమాదాలు తగ్గుముఖం కావండతో శుక్రవారం సిబ్బందితో యూటర్న్ శాశ్వతంగా మూసి వేశారు. ప్రమాదాలు జరుగకుండా యూటర్న్ మూసివేసినందుకు నవయువ యూత్ క్లబ్ సభ్యులు సీఐకి దన్యవాదాలు తెలిపారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ: దైవచింతనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ వెల్లడించారు. మంచిరేవులలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన పూజల్లో ఆమె పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో కౌన్సిలర్ లంకల పద్మవీర్‌రెడ్డి, వేదపండితులు శ్రీనివాస్ పంతులు, గోవింద్‌గారి శ్రీరాములు, భక్తులు పాల్గొన్నారు.

రేపు కూచిపూడి నృత్య ప్రదర్శన

రాయదుర్గం: నాట్యగురువు ఉషా గోరేటి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన యువ ప్రజ్ఞాశాలి ధృతి ముదిగొండ నృత్యప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు నృత్యప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని వివిధ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పాల జ్యోతిరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పారిశ్రామిక శిక్షణ సంస్థలోని ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, డిజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్, మోటార్ మెకానిక్, కార్పెంటర్, తదితర ట్రేడ్‌లలో శిక్షణ పొందాలనుకున్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు విజయనగర్‌కాలనీలో ఉన్న మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించవచ్చు.

భక్తిశ్రద్ధలతో 'ఆయతే తరీమా'

గోల్కొండ: తెలంగాణతో పాటు దేశం సుభిక్షంగా ఉండాలంటూ తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలతో కూడిన ఆయతే తరీమా నిర్వహించారు. టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఈ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు లాభపడాలని ఈ సందర్భంగా ప్రార్థనలు చేశామని ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. అదే విధంగా అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజార్టీతో ఎంపికైన సందర్భంగా ఈ ప్రార్థనలు నిర్వహించామన్నారు. ఈ ప్రార్థనలకు మౌలానా మహ్మద్ సాహెబ్ నేతృత్వం వహించారు. ఖాలేద్ అలీఖాన్, ఆర్గనైజేషన్ కార్యాలయ ఇన్‌చార్జి ఫహాద్, షాహేద్ తదితరులున్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ నుంచి కిష్టమ్మ గుట్టకు వెళ్లే ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రధాన రహదారిపై ప్రతి రోజు వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. వీధి దీపాలు వెలగక వ్యాపారస్తులతో పాటు స్థానికులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చీకట్లో రోడ్డు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

హైటెక్స్‌లో 'పెరల్, జెమ్ ఫెయిర్ -2024' ప్రారంభం





మాదాపూర్: సాంస్కృతిక వారసత్వంలో రత్నాలు, ఆభరణాల ప్రాముఖ్యత ఎక్కువ అని ఇండియా ఇన్ఫార్మా మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైదరాబాద్ జువెలరీ పెరల్, జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్) 2024ను శుక్రవారం హైదరాబాద్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరిమళ హనా నూతన్, అసోసియేషన్ అధ్యక్షులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి రత్నాలు, ఆభరణాల ఎగుమతులను యూఎస్ 75 బిలియన్ డాలర్లకు(రూ.6.2 లక్షల కోట్లు) పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌జెఎం అధ్యక్షుడు మహేందర్ తాయల్, జంట నగరాల జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాస్ చరణ్, తెలంగాణ బులియన్ జెమ్, జువెలరీ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీశ్ పర్షద్ వర్మ, ఎగ్జిబిషన్ కన్వీనర్ ముఖేష్ అగర్వాల్, తెలంగాణ పాన్ బ్రోకర్ జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు పరస్మల్ రాంకా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

- సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి
- 75 మంది పోలీసులకు సేవా పతకాల అందజేత



రాయదుర్గం: పోలీసులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో శుక్రవారం 75 మంది పోలీసులకు సేవా పతకాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖకు మంచి పేరు ప్రతిష్టలు వచ్చేలా విధులను నిర్వహించాలన్నారు. మొత్తం 75 మందికి సేవా పతకాలు అందించగా అందులో మహోన్నత సేవా పతకాలు ముగ్గురికి, ఉత్తమ సేవా పతకాలు 18 మందికి, 54 మందికి సేవా పతకాలు అందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, డీసీపీలు నర్సింహ్మ, ప్రసాద్, సృజన, సాయిశ్రీ. ఎల్‌సినాయక్, డి శ్రీనివాస్, ఏడీసీపీ ఎస్‌కే షమీర్, ఇన్‌స్పెక్టర్లు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ వారోత్సవాల పోస్టర్ విడుదల

హఫీజ్‌పేట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ సంక్షేమ మండలి నిర్వహిస్తున్న పర్యావరణ వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఉపకమిషనర్ వంశీకృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవుల మనుగడకు పర్యావరణ పరిరక్షణ అవసరమన్నారు. వాతావరణాన్ని మెరుగుపరిచే మార్గాలను ప్రోత్సహించాల్సిన అశసరమున్నదన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సంక్షేమ మండలి చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ పులి అమృత్ గౌడ్ మాట్లాడుతూ మానవునికి ప్రకృతికి విడదీయరాని అనుబంధం ఉన్నదన్నారు. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన తమవంతు కృషి చేస్తూ, సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు. దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సంక్షేమ మండలి ప్రతినిధులు పి.అశోక్, షేక్ బాజీ, పరమేశ్వర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో కళాఖండం ఉండాలి

గోల్కొండ: కళాఖండాలు కళాకారుల అద్భుత పనితనానికి నిదర్శనమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ అనేది అందరికి సంబంధించిన విషయం అని అన్నారు. కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చే ఇటువంటి ఆర్ట్ ఫెస్టివల్స్ సంవత్సరం పొడవున కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ కలెక్టర్ పార్వతిరెడ్డి, నార్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కె.లక్ష్మాగౌడ్, అంజు పోదర్, రాజేంద్రపాటిల్, ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు ఉంటుందని 30 గ్యాలరీలు, 250 మంది కళాకారుల 3500 కళాఖండాలు, వంద స్టాల్స్ ఉన్నాయి. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు టికెట్ తీసుకోని ప్రవేశం పొందవచ్చు.

హత్య కేసులో పదేళ్లు జైలు

గచ్చిబౌలి: హత్య కేసులో వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష పడింది. ఇద్దరూ కొబ్బరి బొండాల వ్యాపారులు. తాగిన మైకంలో చిన్న ఘర్షణ జరగడంతో కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో కాలుపై నరకడంతో తీవ్ర రక్తస్రావంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ కేసులో రెండేళ్ల అనంతరం 6వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సి.పావని నిందితుడికి పదేళ్ల జైలు, 2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. గచ్చిబౌలి సీఐ ఎస్.అంజనేయులు తెలిపిన ప్రకారం .. ఓ కొబ్బరి బొండాల వ్యాపారి వద్ద సీహెచ్ మహేశ్వర్‌రావు, ఒసురు చిట్టిబాబు (53)లు పని చేస్తున్నారు. వీరివురూ కొండాపూర్ ఆనంద్‌నగర్ కాలనీలోని సుప్రీం మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో చిట్టిబాబు కొడుకు దుర్గాప్రసాద్ హాస్టల్‌కు రాగా మహేశ్వర్‌రావు తిట్టడంతో చిట్టిబాబు బాధపడ్డాడు. మరునటి రోజు ఇద్దరు మద్యం సేవించి హాస్టల్‌కు వచ్చారు. చిన్న విషయంలో మాటామాటా పెరగడంతో క్షణికావేశంలో చిట్టిబాబు కొబ్బరి బొండం నరికే కత్తితో మహేశ్వర్‌రావు కుడికాలు తొడపై నరికాడు. దీంతో తీవ్ర రక్త స్రావం కావడంతో మహేశ్వర్‌రావును హాస్టల్ సూపర్‌వైజర్, రూమ్ మేట్ విక్రమ్, చిట్టిబాబులు 108 అంబులెన్స్‌లో కొండాపూర్ జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. రెండేళ్ల పాటు సాగిన ఈ కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష పడింది.ఈ కేసులో అడిషనల్ పీపీ నాగేశ్వర్‌రావు, అప్పటి ఇన్‌స్పెక్టర్ జి.సురేష్, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ అంజనేయులు, సీడీఓ ప్రవీణ్ కుమార్, లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ కృష్ణారెడ్డి విధులు నిర్వహించారు.